# ధవళ డ్రైక్లీనర్స్

## డా॥ కొత్త రవీంద్రబాబు

"శుభ్రంగా తుడువ్! కరెంట్ వెలుగులో అక్షరాలు ఆకాశంలో చుక్కలలా ధగ ధగలాడాలి!" ధవళ డ్రై క్లీనర్స్ బోర్డును ఫ్లానెల్ గుడ్డతో తుడుస్తున్న సోముల్ని హెచ్చరించాడు కృష్ణయ్య.

మెయిన్ రోడ్డు పక్కన సందులో సెంటరుకు పది బారల దూరంలో వున్న ధవళ డ్రై క్లీనర్స్‌కు కృష్ణయ్య ఓనరు-సోములు షాప్ అసిస్టెంట్ కం పి.ఎ.!

నియాన్ లైట్లమర్చిన బోర్డును శ్రద్ధగా తుడుస్తున్న సోముల్ని పిలిచాడు మరు నిమిషమే కృష్ణయ్య—

"అరే సోములూ! త్వరగా రా! బేరం వచ్చింది!" అంటూ. ఎత్తు స్టూలు వేసుకుని బోర్డు క్లీన్ చేస్తున్న సోములు వులికిపడి చేస్తున్న పని ఆపి లోపలకు వచ్చాడు.

కృష్ణయ్య "ఆయనకేం కావాలో చూడు!" అన్నాడు వడి వయసు వ్యక్తి. నీరుకావి బట్టలు కట్టుకున్నాడు. చెమటతో బట్టలు తడిచి వంటికి అతుక్కుని వున్నాయి.

"మంచి పట్టు చీరె కావాలి!" అన్నాడు.

"అద్దె పదిహేను రూపాయిలు!" అన్నాడు సోమయ్య-'అంత అద్దె పెట్టగలవా?' అన్న ధ్వని వినపడిందతని మాటలలో.

"పదిహేను గాదు పాతికిస్తా! చీర నాకు నచ్చాలి!" అన్నాడతను నిర్లక్ష్యంగా! ఆశ్చర్యంగా చూస్తున్న సోములి చేతిలో ఇరవై రూపాయిల నోటు అయిదు రూపాయిల నోటు వుంచుతూ "త్వరగా చూపించు! బోలెడు పనులున్నయ్!" అన్నాడు అసహనంగా.

సోములు హేంగర్స్ మీద వేలాడుతున్న జరీ పట్టు చీరెలు చూపాడు! "ఊహూ!" అన్నట్టు తల అడ్డంగా తిప్పాడు నీరుకావి బట్టలతను.

"జరీ బాగా వెడల్పుగా వుండాలి! ఫోటోలో పడాలి!" అన్నాడతను. అతని మాటలు విని వెనక్కి తిరిగాడు షాపు యజమాని కృష్ణయ్య.

కృష్ణయ్య ముఖంలోకి చూసాడు సోములు. సిగ్నల్ ఇచ్చినట్టు తలకొంచెం తిప్పాడు కృష్ణయ్య. సోములు గోడవార వున్న కబోర్డు మంచి పట్టు చీరె తీసి చూపాడు. ఎర్రటి ఎరుపు చీరె మీద బంగారు రంగులో జరీ పని-రాయంచల బారు-మధ్య మధ్య కమలాలు-కళ్ళు జిగేల్‌మంటున్నాయి చూచే వాళ్ళకు.

చీరె నచ్చినట్లు తలూపాడు నీరుకావి బట్టలతను!

"ఏ వూరు మీది?" కృష్ణయ్య అడిగాడు.

"సిరిపల్లె" అన్నాడతను.

"ఈ వూళ్ళో తెలిసినవాళ్ళున్నారా?" సమాధానంగా అతను వీధిలో వెడుతున్న కానిస్టేబుల్ పకీరయ్యను "పకీరన్నా! ఓ పకీరన్నా!" అని కేకేశాడు.

పకీరయ్య లోపలకు వస్తూ "ఓరి నువ్వ్రటా! బాగున్నావా!" అన్నాడతనితో.

"ఆ! బాగానే వున్నా! తెలిసినవాళ్ళున్నారా అని అడుగుతున్నాడీయన!" అంటూ కృష్ణయ్యను చూపాడు.

"ఈయనది మా వూరే! తెలిసినవాడే!" అన్నాడు పకీరయ్య. ఇంతలో రోడ్డుమీద గలాటా జరుగుతుంటే బయటకు వెళ్ళిపోయాడు పకీరయ్య.

పకీరయ్య "సిఫారసు" మీద పట్టు చీరె అద్దెకిచ్చాడు కృష్ణయ్య. ఇస్తూ "సరిగ్గా రేపు సాయంత్రం ఆరు గంటలలోపుగా చీరె తెచ్చి ఇవ్వాలి! నిమిషం దాటినా రోజు అద్దె కట్టాలి! అది మా రూలు!" అన్నాడు.

"అలాగే" అన్నట్టు తలాడించాడతను. సోములు అతని పేరు, అడ్రసు, పుస్తకం మీద రాసుకుని సంతకం పెట్టించుకున్నాడు.

"ఆరు దాటకుండా తీసుకురా!" అంటూ హెచ్చరించాడు సోములు మరోసారి అతడిని.

"పని అవగానే పట్టుకొస్తా! నాకెందుకు మీ చీరె" అంటూ వెళ్ళిపోయాడు నీరుకావి బట్టలతను! సోములిచ్చిన పాతిక రూపాయిలూ జేబులో వేసుకున్నాడు కృష్ణయ్య!

వేన్నీళ్ళకు చన్నీళ్ళలా డ్రై క్లీనింగ్ డబ్బులకు "అద్దె" డబ్బులు జత పడడం ఆనందం కల్గించింది కృష్ణయ్యకు.

"రెండు వేల రూపాయిల చీరె! పాతిక రూపాయిలు పారేసి పట్టుకెళ్ళాడు!" అన్నాడు సోములు విస్మారంగా.

"కూతురి పెళ్ళికేమో?" అన్నాడు కృష్ణయ్య. అద్దె విషయంలో బేరం అడగకుండా పదిహేను రూపాయిలకు అదనంగా పది రూపాయిలు కలిపి ఇచ్చి వెళ్ళిన పల్లెటూరి అతని గురించి ఆలోచిస్తూ వుండిపోయారు కృష్ణయ్య, సోములు.

* * *

"ఇదేమిటి! చీరెనిండా మరకలున్నాయి! నాలుగు వేల రూపాయిల చీరె అనుకున్నావా? జనతా చీరె అనుకున్నావా?" మూడవ రోజు మధ్యాహ్నం చీరె తీసుకు వచ్చినతని మీద విరుచుకుపడ్డాడు సోములు.

"నిన్న సాయంత్రం ఆరింటికి తిరిగి ఇవ్వాల్సింది. నిమిషం ఆలస్యం అయినా అద్దె కట్టాలన్నాను!" అన్నాడు కృష్ణయ్య.

"పాతిక రూపాయిలు అద్దె,పది రూపాయిలు క్లీనింగ్ ఛార్జీ ఇవ్వు!" గదమాయించాడు సోములు.

కిమ్మనకుండా ముప్తై అయిదు రూపాయిలు ఇచ్చి వెళ్ళిపోయాడు సిరిపల్లె అతను.

"అరేయి! చీరె వెంటనే క్లీన్ చెయ్యి! సాయంత్రానికి ఇస్త్రీ చేయించి అట్టిపెట్టాలి!" అన్నాడు కృష్ణయ్య.

చీరె తీసుకులోపలకు వెళుతూ "మురికి, పసుపు, కుంకం మరకలు-పట్టు చీరె కట్టుకోంగానే సరా!" గొణిగాడు సోములు.

అద్దెకు వెళ్ళొచ్చిన చీరెను సాపు చెయ్యడం పూర్తి కానే లేదు! ఇంతలోనే పకీరయ్య వచ్చి కృష్ణయ్యతో "ఎస్.ఐ. బాబుగారు మిమ్మల్నోసారి స్టేషన్‌కు రమ్మన్నారు!" అన్నాడు.

"నన్నా!!" పైకి అన్నాడు కృష్ణయ్య. "ఎందుకు" అని అడగాలనుకున్నాడుగాని ధైర్యం చాలలేదు.


"మిమ్మల్నే! ఓసారి స్టేషన్‌కు రమ్మన్నారు!" గొంతు పెద్దది చేసి సమాధానం చెప్పాడు పకీరయ్య. చుట్టు పక్కలవాళ్ళు కానిస్టేబుల్ మాటలు వింటారేమోనని భయం పుట్టి "సోములూ! నేనిప్పుడే వస్తా! జాగ్రత్తగా చూస్తుండు!" అంటూ పకీరయ్య వెంట వెళ్ళాడు కృష్ణయ్య.

దారి పొడుగునా ఎంత ఆలోచించినా అతనికి ఎస్.ఐ. తననెందుకు రమ్మన్నదీ అర్థం కాలేదు.

కృష్ణయ్య బెరుకుగా స్టేషన్ గదిలో అడుగు పెడుతుండగానే గర్జించాడు ఎస్.ఐ. "ఏమయ్యా! నువ్వు డ్రై క్లీన్ షాప్ పెట్టిందెందుకు? క్లీన్ చెయ్యమని ఇచ్చిన బట్టల్ని అద్దెకిచ్చుకుంటావా"

"లేదు సార్! అలా ఎప్పుడూ చెయ్యం సార్!"

"మాదచ్చోద్! అయ్యగారికెదురు సమాధానం చెబుతావా!" ఉరిమినట్టు మాట్లాడాడు పకీరయ్య. స్టేషన్ బయట పరమ శాంతంగా మాట్లాడే పకీరయ్య ఉగ్ర రూపం చూసి కొంచెం ఆశ్చర్యం కలిగించింది కృష్ణయ్యకు— అంతకంటే ఎక్కువ భయం కలిగింది.



ఏమి సమాధానం చెబితే ఏమంటారోనని భయంతో అతని నోరు బిగుసుకుపోయింది.

“మొన్న సిరిపల్లె వాళ్ళకు ఎఱ్ఱపట్టు చీరె అద్దెకి ఇచ్చావా? లేదా?” హూంకరించాడు ఎస్.ఐ. ఆ విషయం ఎస్.ఐ.కెలా తెలిసిందీ అర్థం కాలేదు కృష్ణయ్యకు. దీనంగా పకీరయ్య వంక చూసాడతను: రెండు రోజులవాడు నీ సిఫారసుమీదే చీరె అద్దెకిచ్చాను' అని గుర్తు చేస్తున్నట్టున్నాయతని చూపులు.

“అయ్యగారడిగిందానికి సమాధాం చెప్పు!” గద్దించాడు పకీరయ్య. అతనికి రెండు రోజుల క్రితం లాండ్రీలో జరిగిన సంభాషణ గుర్తొచ్చినట్లే లేదు.

పకీరయ్య దగ్గర్నుండి ఏ విధమైన్న వత్తాసు రాకపోయేసరికి కృష్ణయ్యకు నిజం ఒప్పుకోక తప్పదని అనిపించింది.

“ఏమో సార్! నేను భోజనానికి వెళ్ళినప్పుడు సోములు అలాటి మెతక పనులేమైనా చేసాడేమో?” అని నసిగాడు.

“అలా దారికి రా! నాలుగువేల రూపాయిల పట్టు చీరె నీ లాండ్రీలో ఇచ్చింది శుభ్రం చేసి ఇవ్వమనా లేక అద్దెకివ్వమనా?” గర్జించాడు ఎస్.ఐ.

సమాధానం చెప్పలేక చేతులు నులుముకుంటూ నుల్చుండిపోయాడు కృష్ణయ్య.

“సమాధానం చెప్పవేం?” గాండ్రించాడు పకీరయ్య. బుర్రకథ చెప్పే వాడి దగ్గర వంతపాడే వాడిలా కనపడ్డాడు పకీరయ్య కృష్ణయ్యకు - బుర్ర కథ చెప్పేవాడికంటే వంత గొంతు పెద్దదిగా వుంటుంది అని గుర్తొచ్చిందతనికి.

“పొరపాటయింది సార్! క్షమించండి! ఇంకెప్పుడూ ఇలా జరగకుండా చూస్తాను!”

“తప్పుడు పని చేసి సారీ అంటే సరిపోయిందా” ఎస్.ఐ. గొంతు ఖంగుమంది.

“నేను షాపులో లేనప్పుడు కుర్రవాడు కక్కుర్తి పడ్డాడు! క్షమించండి సార్!”

“పుండాకోర్! చూడు ఈ ఫోటో!”

నడి వయసు ఆడ మనిషి ఫోటో అది! ఎఱ్ఱ పట్టు చీరె జరీ హంసలు కమలాలు వున్నది - కట్టుకున్నదామె. ఫోటోలో జరీ హంసలు - మధ్య మధ్య కమలాలు బాగా స్ఫుటంగా కనపడుతున్నాయి.

“నేను లేనప్పుడు ఈ చీరె సోములు అద్దెకిచ్చినట్టున్నాడు!” అన్నాడు కృష్ణయ్య ఫోటో బల్లమీద వుంచుతూ.

“ఫోటో సరిగ్గా చూడు!” ఎస్.ఐ. గొంతు ఉరిమినట్టు వినపడింది. ఫోటో చేతిలోకి తీసుకుని పరీక్షగా చూసాడు కృష్ణయ్య.

పట్టు చీరె కట్టుకున్నామె కుర్చీలో కూర్చున్న తీరులో ఏదో అసహజత కనిపించిందతనికి. మెడ ఒక పక్కకు వరిగి వుంది. కాళ్ళు నీలుక్కుపోయి వున్నవి-

కళ్ళు తెరుచుకుని వున్నవి కాని ... విషయం అర్థం అయిన కృష్ణయ్య చేతులు గడగడ వణికిపోసాగాయి.

"శవానికి కట్టడానికి చీరె అద్దెకిస్తావా?? నిన్ను లాకప్‌లో పడేసి నాలుగు బాదితేగాని బుద్ధి రాదు!"

కృష్ణయ్య గొంతు ఎలాగో పెకల్చుకుని "సార్! సార్! ఈ ఒక్కసారికీ క్షమించండి సార్! మళ్ళీ ఎప్పుడూ క్లీనింగ్‌కు వచ్చిన బట్టలు అద్దెకివ్వను!"

"మాటల్తో సరిపోయిందా! ఆ చీరె డ్రామా యాక్టరు సరితది! చీరె ఖరీదు నాలుగువేల రూపాయిలు ఆమె కివ్వు!" హుంకరించాడు ఎస్.ఐ.

' అన్యాయం సార్! చీరె ఖరీదు పదిహేను వందలో, రెండు వేలో వుంటుంది! ' నాలుక దాకా వచ్చిన మాటలు ఆగిపోయాయి కృష్ణయ్యకు. సరే ననట్టు తలాడించాడు.

"ఊ! ఇంకా నిలబడ్డావేం? పోయి పైకం పట్రా! అయ్యగారు మంచివారు కాబట్టి ఇంతటితో వదులుతున్నారు!" కసురుకున్నాడు పకీరయ్య.

పోలీసు స్టేషన్ బయటకు నడిచాడు కృష్ణయ్య. గేటు దగ్గర కనపడ్డాడు రియల్ ఇమేజ్ స్టూడియో ఓనరు రావు. అతను కృష్ణయ్యకు చిన్నప్పటి నుంచి స్నేహితుడు.

"అరే కృష్ణా! సిరిపల్లెలో చనిపోయినామె ఫొటో తీసాను నిన్న. ఫోటోలు డెవెలప్ చేసి ఆరడానికి పెట్టాను! ఇందాక డ్రామా ఏక్టరు సరిత ఫోటోలు



తీయించుకోడానికి స్టూడియోకి వచ్చి ఆ ఫోటోలు పరీక్షగా చూసి వెళ్ళింది! అంతే! నిమిషాల మీద కానిస్టేబుల్ వచ్చి సిరిపల్లెలో తీసిన ఫొటో కాపీ తీసుకుని వెళ్ళాడు!"

"చంపావు గురూ! ఆ చీరె మా షాపులో అద్దెకు తీసుకువెళ్ళాడు!"

"ఆ! అలాగా! నేనప్పుడు అనుకున్నా చనిపోయిన పేదరాలికి ఇంత ఖరీదయిన చీర కట్టారేమా అని! గురూ ఆ చీరె డ్రామా ఏక్టరు సరితదా ఏం!"

అవునన్నట్టు తలూపాడు కృష్ణయ్య.

"అబ్బ ఎంతపని జరిగి పోయింది గురూ!" ఎపాలజిటిక్‌గా అన్నాడు రావు.

"గురూ! పదిహేను వందల చీరెకు నాలుగు వేలు కట్టిస్తున్నాడు ఎస్.ఐ! ఇన్నేళ్ళుగా దుస్తులు అద్దెలకిచ్చి సంపాదించినది కాస్తా ఈ దెబ్బతో ఎగిరిపోతుంది గురూ!"

"ఇవ్వాళ నువ్వు లేచిన వేళ మంచిది కాదు గురూ!" అన్నాడు రావు.

"కానిస్టేబుల్ పకీరయ్య సిరిపల్లె అతను తనకు తెలుసు అన్నాడు. లేకపోతే ఆ ఏబ్రాసిమొఖానికి పట్టు చీరె అద్దెకిచ్చేవాడినా!" దిగులుగా అన్నాడు కృష్ణయ్య నాలుగడుగులు వేసిన తర్వాత రావుతో.

"గురూ! సరిత చీరె అద్దెకిస్తే ఎస్.ఐ.కి అంత కోపం ఎందుకొచ్చిందో?" అన్నాడు.

"నువ్వు సత్తెకాలం మనిషివి గనుక ఇలాంటి చిక్కుల్లో ఇరుక్కుంటావు! సరిత ఎస్.ఐ. ఖులాకాలో మనిషి!"

రావు మాటలతో గుండె దడ పెరిగి ఇంటికి పరుగెత్తాడు కృష్ణయ్య!

Phone: 77115

**SHA MOHANLAL MAGANLAL & Co.,**

*Wholesale Stationery and Paper Merchants*

11-41-47 Kandulavari Street
VIJAYAWADA - 520 001.

Distributors & Authorised Dealer for:

**Camlin Private Limited : Bombay**
**Kores (India) Limited: Bombay**
**Hindustan Pencil Private Limited: Bombay**
**Luxor Pen Company: Delhi**